క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పెన్నానది వద్ద ఇసుక టాక్టర్లను సీజ్ చేసిన రూరల్ ఎస్‌ఐ ధరణిబాబు

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి: పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లను తాడిపత్రి రూరల్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. యథేచ్ఛగా ఇసుక దోపిడీ అన్న కథనం సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. దీంతో రూరల్ అప్‌గ్రేడ్ సీఐ ఆదేశాల మేరకు రూరల్ ఎస్‌ఐ ధరణిబాబు శాండ్ టీంతో కలసి పెన్నానదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను సీజ్ చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహన యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు.

ఇసుక టిప్పర్ సీజ్

పెద్దపప్పూరు: మండలంలోని చీమలవాగుపల్లి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం తెల్లవారుజామున ఇసుక టిప్పర్‌ను సీజ్ చేశారు. తాడిపత్రి పట్టణానికి చెందిన టిప్పర్ యజమాని మండలంలోని పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులకు చిక్కారు. టిప్పర్ యజమానితో పాటు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

భగవద్గీత మనన పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

పామిడి: పట్టణంలోని దత్తపాదుకా క్షేత్రంలో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం భగవద్గీత మనన పోటీలు నిర్వహించారు. పోటీలకు 49 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా రాజ్‌కుమార్‌శర్మ, టీటీ శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎం గీత, ఎస్ ఉమాబాయి వ్యవహరించారు. అంతకుముందు పోటీలను ఆలయ ప్రధాన కమిటీ సభ్యులు సీతమ్మ, ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ నెల 26న అప్పాజీ మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ జన్మదినాన్ని పురస్కరించుకుని విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో దత్త భోగేశ్వర, విశ్వనాథ్, శ్రీనివాసులు, భక్తాదులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షత వీడండి



బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: బాలికల పట్ల లింగ వివక్షత వీడాలని మహిళా పోలీస్ షేక్ రజియా బేగం సూచించారు. మంగళవారం మండలంలోని కల్లూరులో గ్రామ సచివా లయం–2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల పట్ల లింగ వివక్షత, అసమానతలపై కిశోరి బాలికలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికలకు చిన్న వయస్సులో వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.బాలికలను బాలురతో పాటు సమానంగా చూడాలన్నారు.

23న తిరంగా యాత్ర

తాడిపత్రి రూరల్: పట్టణంలో ఈనెల 23న తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు మంగళవారం తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు 23న ఉదయం 7.30 గంటలకు గాంధీ సర్కిల్ నుంచి అశోక్ పిల్లర్ వరకూ తిరంగా యాత్ర చేపట్టనున్నారు. కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా జాతీయ జెండాలతో హాజరు కావాలని బీజేపీ నాయకులు తెలిపారు.

ఎంపీడీఓకు సన్మానం



శివాజీరెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

గుత్తి రూరల్: గుత్తి మండల ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొంది వజ్రకరూరు ఎంపీడీఓగా బదిలీపై వెళ్తున్న శివాజీరెడ్డిని ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు ఆయనను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ వెంకటేష్, కార్యదర్శులు ధనలక్ష్మి, సాదిక్, సుమలత, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ విజయభాస్కర్, సిబ్బంది అబ్దుల్, వాసు, రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, రాజన్న, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం!



- మూడు దశాబ్దాలుగా కలగా చేపల మార్కెట్
- ఇబ్బందుల్లో వ్యాపారులు

గుత్తి: గుత్తిలో చేపల మార్కెట్ లేక వ్యాపారులు, కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. గత మూడు దశాబ్దాలుగా చేపల మార్కెట్ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. దీంతో గత్యంతరం లేక విక్రయదారులు రోడ్ల పక్కనే చేపలను విక్రయించాల్సి వస్తోంది. దుమ్ము, ధూళి చేపలపై పడుతుండటంతో.. ప్రజలు చేపలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. చేపల మార్కెట్ లేకపోవడం వల్ల విక్రయాలు సరిగా జరగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. 30 ఏళ్లగా చేపల మార్కెట్ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. గుత్తి, వైటీ చెరువు, పాత కొత్త చెరువు, మాముడూరు, అబ్బేదొడ్డి, బాచు పల్లి, జక్కల చెరువు తదితర ప్రాంతాల నుంచి చేపలను వ్యాపారులు గుత్తికి తెచ్చి విక్రయిస్తుంటారు. చేపల మార్కెట్ లేకపోవడంతో ఇటు వ్యాపారులు, అటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

గుత్తిలో రోడ్డు పక్కనే చేపలు విక్రయిస్తున్న దృశ్యం

రోడ్డు పక్కన విక్రయిస్తున్నాం



చేపల మార్కెట్ లేకపోవడంతో చేపలను రోడ్డు పక్కన విక్రయించాల్సి వస్తోంది. చేపలపై దుమ్ము, ధూళి పడుతుండటంతో వ్యాపారాలు సరిగా జరగడం లేదు. అధికారులు స్పందించి చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలి.

–రామలక్ష్మి, చేపల వ్యాపారి, గుత్తి

అధికారులు పట్టించుకోవడం లేదు



చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేశాం. అయినా ఎవరూ స్పందించడం లేదు. చేపలు విక్రయించడానికి నానా తంటాలు పడాల్సి వస్తున్నది. వాన వస్తే.. ఇక ఆ రోజు వ్యాపారం జరగదు.

–శ్రీరాములు, చేపల వ్యాపారి, గుత్తి

మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం



చేపల మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు ప్రతి పాదనలు పంపాం. వారి అనుమతితో చేపల మార్కెట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తాం.

– జబ్బార్‌మియా, మున్సిపల్ కమిషనర్

నేటి నుంచి యల్లమ్మ పరుష



ప్రారంభానికి సిద్ధంగా యల్లమ్మ గుడి

శింగనమల: మండలంలోని సోదనపల్లిలో యల్లమ్మ దేవాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఈనెల 21, 22 తేదీల్లో పరుష నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే కురుబల ఆరాధ్య దైవం అలూగురప్ప స్వామి జలధి పూజ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మంగళవారం గ్రామస్తులు మాట్లాడుతూ ఈ నెల 21న సాయంత్రం 4 గంటలకు అలూగురప్ప స్వామి బైటగూళ్ల వద్ద దేవర్ల కలియుట, గంగపూజ, వరుణ వాస్తు పూజ, పుణ్యహవాచనం, నాంది పూజ, రక్షా బంధనం, గణపతి హోమం, వాస్తు హోమం, బలిహారం , జలాదివాసం, క్షీరాదివాసం ఉంటుందన్నారు. 22న తెల్లవారుజామున 4 గంటలకు గంగపూజ, బిందెపూజ, నూతన దేవరప్పను నియమించడం జరుగుతుందన్నారు. 11 గంటలకు పటాలు పోయుట, నూతన వస్త్ర స్వీకరణ, 3 గంటలకు బండారు ఇచ్చుట, యల్లమ్మ నూతన దేవాలయంలోకి ప్రవేశించు కార్యక్రమం, కురబల ఆరాధ్య దైవమైన దేవర్ల గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో భూమిలోని పోషకాలు, వాటి విలువలపై ప్రైమరీ అగ్రికల్చర్ ఆపరేటివ్ (పీఏసీఎస్) సభ్యులకు 15 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తరచూ ఒకే పంటను సాగు చేయరాదన్నారు. పంటల మార్పిడి తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాగే పొలాల్లో మట్టి నమూనాల పరీక్షలు చేయించుకోవాలన్నారు. వాటి ఫలితాల ఆధారంగా ఖరీఫ్ సీజన్‌లో మందుల వాడకం తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, జిల్లా కోఆపరేటివ్ అధికారి అరుణకుమారి, డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ తల్లి జాతర



చెదుల్లలో పూజలందుకుంటున్న పెద్దమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండలంలోని చెదుల్ల గ్రామంలో మంగళవారం వైభవంగా పెద్దమ్మ తల్లి జాతర నిర్వహించారు. గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామస్తులు పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. జాతరలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, ఆలూరి రమణారెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్, మాజీ మంత్రి శైలజానాథ్ తనయుడు రిత్విక్ పాల్గొని పూజలు నిర్వహించారు. అదే విధంగా గ్రామంలో వైఎస్సార్ నాయకుడు సర్పంచ్ శ్రీనివాసరెడ్డి భోజనాలు ఏర్పాటు చేశారు.

ఇల్లూరులో ఘనంగా పెద్దమ్మ దేవర

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరులో గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం పెద్దమ్మదేవర ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పెద్దమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే దున్నపోతులను ఊరంతా ఊరేగించి, తెల్లవారు జామున అమ్మవారికి బలిదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఊరంతా విందు భోజనాలు చేసుకొని సంతోషంగా గ్రామదేవర జరుపుకున్నారు ఈ సందర్భంగా గ్రామంలో గాజులు, ఆటబొమ్మలు, తినుబండారాలు అంగళ్లు వెలిశాయి. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ గౌస్ మహమ్మద్‌బాషా, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవు

పెద్దపప్పూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే ఎలాంటి వ్యాదులు దరిచేరవని వైద్యురాలు ప్రీతి సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యసమస్యలు వచ్చినపుడు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు.అత్యవసర పరిస్థితుల్లో 104, 108వాహన సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శర్మాషవలి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



గుంతకల్లులోని పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు



పామిడిలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్/పామిడి: ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అసంఘటిత కార్మికులందరికీ కనీస వేతనం కింద నెలకు రూ.26 వేలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ(భారత కార్మిక సంఘాల సమాఖ్య) జిల్లా కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు మోదీ సర్కారు తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు, నూతన వ్యవసాయమార్కెట్ చట్టాలను వ్యతిరేకిస్తూ మంగళవారం కార్మిక నాయకులు గుంతకల్లులోని పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో నిరసన తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికుల 8 గంటల పని విధానాన్ని పరిరక్షించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.600 చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా నాయకులు రఘునాథ్‌రెడ్డి, రామ్‌దాస్, పట్టణ కార్యదర్శి రామాంజినేయులు, సత్తార్, నారాయణ, షేక్షా, బాష తదితరులు పాల్గొన్నారు. అలాగే లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా సీఐటీయూ నాయకులు హెడ్‌పోస్టాఫీసు ఎదుట నిరసన తెలిపారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, అధ్యక్షుడు జగదీష్, నాయకులు తిమ్మప్ప, ఎస్‌కెఎం.బాష తదితరులు పాల్గొన్నారు.

- పామిడిలోని అంబేడ్కర్ సర్కిరల్ వద్ద ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడి అబద్దపు హామీలతో అధికారం చేపట్టిన ఏడాది అవుతున్న ఇచ్చిన ఎన్నికల హామీలను నిలబెట్టుకోకపోవడంపై నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సీపీఎం సీనియర్ నాయకుడు పీ అనిమిరెడ్డి, ఆ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కే చంద్రమోహన్‌రెడ్డి, కే మల్లేసు, జే ఈశ్వరయ్య, ఆర్ ముత్యాలు, నారాయణ స్వామి, ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి



పెద్దవడుగూరులో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు



యల్లనూరులో నిరసన తెలుపుతున్న దృశ్యం

పెద్దవడుగూరు/యల్లనూరు: రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్, తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శులు ఆదినారాయణ, ఓబిరెడ్డి డిమాండ్ చేశారు.. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఎన్‌డీఏ ప్రభుత్వం రైతుల పట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరికి గాంధీజీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు రూ.20 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా ఇంతవరకూ రైతులకు విత్తన పంపిణీ చేపట్టలేదని మండిపడ్డారు. రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సీపీఐ సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి, నారాయణస్వామి, కార్యకర్తలు ఆదిరంగారెడ్డి, చిన్నరంగులు, ఫక్రుద్దీన్, వెంకట్రాముడు, అరుణ్, బాబయ్య, రంగ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రమేష్, వ్యవసాయ సంఘం మండల కార్యదర్శి సూరి, రైతు సంఘం మండల కార్యదర్శి ఓబులేసు, రైతులు పాల్గొన్నారు.

యువతకు నైపుణ్యాలు ఎంతో అవసరం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శైలజ

బుక్కరాయసముద్రం: యువతీ యువకులకు నైపుణ్యాలు ఎంతో అవసరమని డీఆర్‌డీఏ పీడీ శైలజ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ– సీడాప్ ద్వారా నిర్వహిస్తున్న ట్రైనింగ్ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రోజూ ఐదుగురు నిరుద్యోగ యువతీ యువకులను సీడాప్ జాబ్ స్కీకర్స్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. సీడాప్ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, జాబ్ మేళా గురించి క్షేత్రస్థాయిలో తెలపాలన్నారు. యువతీ యువకులు నైపుణ్యాలు పెంపొందించుకుంటే మంచి సంస్థలలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పథకం కింద 100 రోజులు పూర్తి అయిన కుటుంబాలకు సంబంధించిన ఇళ్లలో యువతీ యువకులకు నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి సూర్యనారాయణ, సీడాప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హనుమంతుడికి విశేష పూజలు

యల్లనూరు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి గుడిలో మంగళవారం రెండోరోజు స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలతో ఆలయం కిటకిటలాడింది. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు.

వైభవంగా గంగ పూజ

గుత్తి: ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి బాగా పంటలు పండాలని ఆకాంక్షిస్తూ గుత్తి కోటలోని బెణకల బావిలో మంగళవారం గంగ పూజ చేశారు. కోట కాలనీవాసులు, గంగపుత్రులు (రజకులు) బావిలోకి పువ్వులు, పండ్లు , పసుపు, కుంకుమ తదితర వస్తువులు వేసి మొక్కులు తీర్చుకున్నారు. కోట కాలనీవాసులు బాచి, జీకే నాగరంగ ప్రసాద్, రాము,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



వేములపాడు సచివాలయంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

యాడికి: మండల కేంద్రంలోని నంబర్ 3, వేములపాడు, గుడిపాడు గ్రామాల్లోని సచివాలయా లను గుంతకల్లు డీఎల్‌డీఓ విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవనానికి కేటాయించిన నిధులు, పనుల వివరాలపై ఆరాతీశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను తనిఖీ చేశారు. రైతులు, సచివాలయ ఉద్యోగుల వివరాలు, హాజరు, సేవలపై ఎంపీడీఓ వీర్రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. సచివాలయాల కార్యదర్శులు రమేష్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆశా'లకు పనిభారం తగ్గించండి

తాడిపత్రి: తమకు పనిభారం తగ్గించేలా చూడాలని కోరుతూ తాడిపత్రి ఆశావర్కర్లు మంగళవారం సీఐటీయూ నాయకులతో కలసి తహసీల్దార్ రజాక్‌వలికి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు పద్మావతి, నాగరత్న మాట్లాడారు. ఫ్రైడే డ్రైడే అంటూ రకరకాల సర్వేల వారితో పని చేయిస్తూ ప్రభుత్వం ఒత్తిడి పెంచుతోందన్నారు.అలాగే ఒక సచివాలయం పరిధిలో పని చేసే ఆశాలను మరో సచివాలయానికి మార్చి ఇబ్బందులకు గురి చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. జనాభాకు అనుగుణంగా ఆశావర్కర్లను నియమించి, సర్వేల నుంచి విముక్తులు చేయాలన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శన

పామిడి: మండలంలోని కండ్లపల్లిలో తెలుగుభాష సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో స్వరరాగ నాటక కళా సమితి సౌజన్యంతో సోమవారం రాత్రి నిర్వహించిన సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్వరరాగ నాటక కళా సమితి సభ్యులు పుంజా కృష్ణారావుయాదవ్, దేవరాజు, రమణమూర్తి, ఆంథోని, హనుమంతరెడ్డి, వనజకుమారి, నాగవేణి పోటీపడి నటించిన నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈసందర్భంగా వారిని గ్రామపెద్దలు సత్కరించారు.

కంటి పరీక్షలకు స్పందన

తాడిపత్రి రూరల్ : పట్టణంలోని ఆర్‌వీ స్వామి కల్యాణమండలంలో మంగళవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు చేసి, 105 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కంటి పరీక్షలకు హాజరైన వారికి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యులు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

'బడుగులకు తీవ్ర అన్యాయం'

పామిడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలవారిని ఓటుబ్యాంకులుగా వాడుకుంటూ తీవ్ర అన్యాయం చేస్తున్నాయని భారతీయ భీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు, పామిడివాసి సాకే ఓబులేసు ధ్వజమెత్తారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు ఎస్సీ కులాలను హీనాతిహీనంగా చూస్తున్నాయన్నారు. తిరుపతిలో బీటెక్ చదువుతున్న మాల విద్యార్థి జేమ్స్‌ను తీవ్ర చిత్రహింసలు పెట్టి దాడి చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నియోజకవర్గంలో మాలలను బహిష్కరిస్తూ దౌర్జన్యాలకు చేయడం, బీసీ, బడుగు, బలహీన వర్గాలను అణచివేతకు గురి చేయడం ప్రభుత్వాల నిరంకుశత్వ పాలనకు అద్దం పడుతున్నాయన్నారు. ప్రభుత్వాలు పద్ధతి మార్చుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామాంజనేయులు, నల్లప్ప, రమేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు, చిన్న ఆంజనేయులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు కంటి వైద్యశిబిరం

పామిడి: పామిడిలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం విశ్వభారతి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కే భాస్కర్, కే బండయ్య మంగళవారం తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డు, రెండు పాస్‌ఫోటోలు, సెల్‌ఫోన్ వెంట తెచ్చుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం 9390616767, 8328053650 నంబర్లను సంప్రదించాలన్నారు.

వివాహాలకు ఆర్థిక సాయం

శింగనమల: మండలంలోని నాగులగుడ్డం గ్రామానికి చెందిన వన్నూరప్ప కుమార్తె , గురుగుంట్ల గ్రామానికి చెందిన నాగన్న కుమార్తె వివాహానికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున రూ.20 వేలు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి వెంకటరమణ ఆర్థిక సహాయం చేశారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని పెళ్లి కుమార్తెల గృహాలకు వెళ్లి నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాసులు, నడిపి ఆంజనేయులు, సతీష్, లక్ష్మన్న, శివ, పవన్‌కుమార్, రమేష్, గంగాధర, నల్లప్ప, కుళ్లాయప్ప, నాగముని పాల్గొన్నారు.

రేపు సామూహిక హనుమన్ చాలీషా పారాయణం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఏటిగడ్డ పాలెంలోని వ్యాసరాయ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం హనుమన్ జయంతిని పురస్కరించుకుని మహిళలచే సామూహిక హనుమన్ చాలీషాను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు హాజరు కావాలన్నారు.

ఎంపీటీసీ మృతి



ఎంపీటీసి నారాయణ (ఫైల్)

పెద్దపప్పూరు: మండలంలోని సోమనపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ నారాయణ (67) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కొంత కాలంగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు పలు ప్రవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో వారం రోజుల నుంచి ఇంటి వద్దనే ఆక్సిజన్ ద్వారా సేవలందిస్తున్నారు. ఈక్రమంలో మంచానపడ్డ ఆయన మంగళవారం తుదిశ్వాస విడిచారు. బుధవారం సోమనపల్లిలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

గుంతకల్లుటౌన్: పట్టణ శివార్లలోని కొనకొండ్లరోడ్డు స్విమ్మింగ్ పూల్ వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఘటనలో కొనకొండ్ల ఎర్రిస్వామి, చాబాల రాము గాయపడ్డారు. వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని గార్లదిన్నెకు చెందిన శ్రీనివాసులు, రాము గాయపడ్డారు. వివరాలు.. గార్లదిన్నె నుంచి ఇద్దరూ బైక్‌లో గుత్తికి బయలుదేరారు. మార్గమధ్యంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన వారిని గుత్తికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జూదరుల అరెస్ట్ ..

గుంతకల్లు రూరల్: మండలంలోని నెలగొండ గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్ప తెలిపారు. వారి నుంచి రూ.30,780 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.